ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- లోక్‌సభ స్థానాలను 50 శాతానికి పెంచుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- పర్యాటక ప్రాంతమైన గండికోట వారసత్వ సంపదకు ప్రాచుర్యం కల్పించే లక్ష్యంతో `గండికోట రన్`ను నిర్వహించనున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

- రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసేందుకు సహకారం అందించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

- పట్టణ స్థానిక సంస్థల పరోక్ష ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది.

==========

లోక్‌సభ స్థానాలను 50 శాతానికి పెంచుతూ కేంద్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఢిల్లీలో ఈరోజు ఎన్డీయే పక్షాల నేతలతో ముఖ్యమంత్రి భేటీ అనంతరం కేంద్రమంత్రులు హెచ్.డి. కుమార స్వామి, కె. రామ్మోహన్ నాయుడుతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్రం అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. లోక్‌సభ స్థానాలను పెంపు అనేది గొప్ప విషయమనీ, దాని వల్ల ఎటువంటి నష్టం ఉండదన్నారు. ప్రస్తుతం 129 లోక్‌సభ స్థానాలు ఉన్న దక్షిణ భారతంలో డీలిమిటేషన్ తర్వాత 195 స్థానాలకు పెరుగుతుందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం 25 సీట్లు ఉండగా... పెంపుతో ఆ సంఖ్య 38కి చేరుతుందన్నారు. జనాభాలో సగం ఉన్న మహిళలకు తగిన ప్రాధాన్యం దక్కాలని మహిళా రిజర్వేషన్ విషయంలో కేంద్రంతో కలసి పని చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

గండికోట వారసత్వ సంపదకు విస్తృత ప్రాచుర్యం కల్పించడంతో పాటు.. ప్రజల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించే లక్ష్యంతో `గండికోట రన్' నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో 'గండికోట రన్ - 2026' పోస్టర్‌ను పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్, కార్యదర్శి ఆమ్రపాలి కాటలతో కలిసి మంత్రి ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ (ASA), 'గో హెరిటేజ్ రన్స్' సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 27వ తేదీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రన్‌లో సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిట్‌నెస్, పర్యాటకం ద్వారా ప్రజలను గండికోట చారిత్రక, వారసత్వ వైభవానికి మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. చారిత్రాత్మక కోట, పెన్నా నది లోయ అందాలు, విశిష్టమైన ప్రకృతి దృశ్యాల నడుమ సాగే ఈ పరుగు.. క్రీడాకారులకు గండికోట చరిత్ర, సంస్కృతిని తెలుసుకునే అద్భుత అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు www.asaao.org లేదా www.ifnish.com వెబ్‌సైట్‌ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

==========

రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల పరోక్ష ఎన్నికలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు / నగర పంచాయతీల పరోక్ష ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించింది. డిసెంబరు 5వ తేదీన డిప్యూటీ మేయర్, వైస్ ఛైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఎన్నిక జరగకపోతే... మరుసటి రోజు డిసెంబర్ 6వ తేదీన జరుపుతున్నట్లు ఎస్ఈసీ వెల్లడించారు. డిసెంబర్ 1వ తేదీన లేదా అంతకుముందే ప్రత్యేక సమావేశాలకు సంబంధించి సభ్యులకు నోటీసులు జారీ చేశారు. శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ ఎన్నికలు నిర్వహించనున్నారు. గతంలో వాయిదా పడిన నర్సీపట్నం, మాచర్ల మున్సిపాలిటీల వైస్ ఛైర్‌పర్సన్ పదవులకు కూడా డిసెంబరు 5న ఎన్నికలు జరగనున్నాయి. అలాగే నిన్న పోలింగ్ ముగిసిన ఈ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు, ఫలితాలను ఈనెల 30న వెల్లడించనున్నట్లు తెలిపారు.

విరామం

==========

57వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (IFFI)లో భాగంగా అసాధారణ కథనం, సంక్లిష్ట పాత్రలపై ఈరోజు పనాజీలోని కళా అకాడమీలో మాస్టర్‌క్లాస్ నిర్వహించారు. `ఒకవేళ విలన్ చెప్పేది నిజమైతే?` అనే శీర్షికతో జరిగిన ఈ సెషన్‌లో తమిళ చిత్ర పరిశ్రమలో పనిచేసే ప్రఖ్యాత చిత్ర దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ పాల్గొనగా, సినీ విమర్శకుడు సుధీర్ శ్రీనివాసన్ దీనికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. నైతికంగా సంక్లిష్టమైన పాత్రలను రాయడంలో తన విధానాన్ని వివరిస్తూ... సామాజిక పరిసరాలు మానవ ప్రవర్తనను ఎలా తీర్చిదిద్దుతాయో, వ్యక్తిగత ఎంపికలను ఎలా ప్రభావితం చేస్తాయి అనే దానిపై ఆయన చర్చించారు. తన కథ చెప్పే విధానాన్ని వివరిస్తూ.. వ్యవస్థలను ప్రతినాయకులుగా చిత్రీకరించడం తనకు మరింత సవాలుగా, ఆసక్తికరంగా అనిపిస్తుందన్నారు. వినోదాన్ని.. అర్థవంతమైన సినిమాను సమతుల్యం చేయడం, సామాజిక పద్ధతులను ప్రశ్నించడానికి హాస్యాన్ని ఉపయోగించడం, లింగ సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలను కూడా సుబ్బరాజ్ ప్రస్తావించారు.

==========

ఆంధ్రప్రదేశ్ లోని దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, ఆగ్నేయ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో కోస్తాంధ్రప్రదేశ్ లో రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి సి.హెచ్. నాగభూషణం పేర్కొన్నారు. అలాగే పొగ మంచుకూడా కురిసే అవకాశం ఉందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో తుపానులను సమర్ధవంతంగా ఎదుర్కొనేలా విద్యుత్ పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఈరోజు నిర్వహించిన వివిధ రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్రంలో ఓర్నాట్, మురాసు తుపాన్ల కారణంగా విద్యుత్ వ్యవస్థకు జరిగిన భారీ నష్టాన్ని కేంద్రమంత్రికి వివరించారు. తుపానుల సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు దెబ్బతినడంతో లక్షలాది విద్యుత్ కనెక్షన్లకు సరఫరా నిలిచిపోయిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రకృతి విపత్తుల ప్రభావాన్ని తగ్గించేందుకు తీర ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన పటిష్ఠమైన విద్యుత్ వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని మంత్రి వివరించారు. ఇందులో భాగంగా తీర ప్రాంతాల్లో భూగర్భ కేబుళ్లు ఏర్పాటు చేయడంతో పాటు, విద్యుత్ లైన్లను స్పన్‌పోల్స్‌తో పునర్నిర్మించేందుకు 4 వేల 851 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపి 90 శాతం నిధులు సమకూర్చాలని గొట్టిపాటి రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

==========

భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టు క్రికెట్ మ్యాచ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 5 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. ప్రస్తుతం టామ్ బ్లండెల్ 53, గ్లెన్ ఫిలిప్స్ 36 పరుగులతో క్రీజులో కొనసాగుతున్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ 2 వికెట్లు తీయగా, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్, వాషింగ్టన్ సుందర్ తలో వికెట్ తీశారు.

==========
==========